క్లుప్తంగా

మునగపాక హైస్కూల్‌కు ఎస్ఎస్ఎఫ్ ఇండియా వితరణ



మునగపాక హైస్కూల్ విద్యార్థులతో ఎస్ఎస్ఎఫ్ ఇండియా ప్రతినిధులు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సోమవారం ఎస్ఎస్ఎఫ్ ఇండియా పలు సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రూ.6,21,600 విలువ చేసే 10 కంప్యూటర్లను, 20 కుర్చీలు, 20 టేబుళ్లను బహూకరించింది. ఈ సందర్భంగా హైస్కూల్ పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఎస్ఎస్ఎఫ్ ఇండియా సీఎండీ కుమరేషన్ రాజేంద్రన్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదువుకోవాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, కంపెనీ హెచ్ఆర్ అనిత సాహు, కంపెనీ ప్రతినిధి అప్పలనాయుడు, హైస్కూల్ వైస్ చైర్మన్ గిరిజ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ, కుష్టు నివారణకు పటిష్ట చర్యలు



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న బాలాజీ

నక్కపల్లి: జిల్లాలో క్షయ, కుష్టు వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా క్షయ, కుష్టు నివారణ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారి ఎంఎస్‌వీకే బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు ప్రతి నెలా రూ.10 వేల విలువైన మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం పింఛన్ కూడా అందజేస్తోందన్నారు. ఆస్పత్రిలో ఉచితంగా సరఫరా చేసే మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. స్థానిక ఎంఆర్సీ భవనంలో సోమవారం ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో ఉచితంగా సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు 6 శాతం, అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ పీడితులకు 5 శాతం సీట్లు కేటాయించాలని సూచించారు.

నూకేష్ మృతి తీరని లోటు

నక్కపల్లి: బీజేపీ సీనియర్ కార్యకర్త నున్న నూకేష్ మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. సోమవారం నూకేష్ దశదిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, పార్టీ నాయకులు ఈగల వెంకటేశ్వరరావు, పోలినాటి నానాజీ, రాష్ట్ర యువ మోర్చా నాయకులు డాక్టర్ భరత్, చిట్టూరి బాబూరావు, నూకయ్యశెట్టి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చూచుకొండ–గణపర్తి బ్రిడ్జి



చూచుకొండ–గణపర్తి బ్రిడ్జి

మునగపాక: మండలంలోని చూచుకొండ–గణపర్తి గ్రామాల మధ్య నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రోలుగెడ్డను ఆనుకొని గతంలో బ్రిడ్జి నిర్మించారు. ప్రస్తుతం బ్రిడ్జి అడుగుభాగం పూర్తిగా దెబ్బతింది. ఈ బ్రిడ్జి మీదుగా మండల కేంద్రమైన మునగపాక, అచ్యుతాపురంతో పాటు కశింకోట మండలం, యలమంచిలి వైపునకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, ప్రైవేటు స్కూల్ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జి కూలి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి C/o మునగపాక



రూ.48లక్షలతో నిర్మించిన మునగపాక బైపాస్ రోడ్డు



రూ.49 లక్షలతో నిర్మించిన సచివాలయం

కోట్లాది రూపాయలతో పలు పనులు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో చెక్కు చెదరని ప్రగతి

ఆ ఫలాలపై ప్రజల్లో ఇప్పటికీ హర్షాతిరేకాలు

మారిన మునగపాక రూపరేఖలు



సుందరంగా దర్శనమిస్తున్న సంపద తయారీ కేంద్రం

మునగపాక: గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మునగపాక పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఒక్కసారిగా రూపురేఖలు మారిపోయాయి. ఇందుకు ఆ గ్రామంలో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులే నిదర్శనం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులతో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. మునగపాకలో ప్రజలకు చేరువైన పాలన అందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. నేటికీ ఫలాలను ప్రజలు అనుభవిస్తున్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి రోజుల తరబడి తిరిగే పరిస్థితులకు చెక్ పెట్టేందుకు నిర్మించిన సచివాలయ భవనాలు నేడు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

మచ్చుతునకలు ఈ పనులు..

మునగపాక పంచాయతీలో జరిగిన అభివృద్ధిపై నేటికీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.98 లక్షల వ్యయంతో రెండు సచివాలయాలు ఒక్కొక్కటి రూ.49 లక్షల నిధులతో నిర్మించారు.

- దళితవాడకు వెళ్లేందుకు వీలుగా రూ.38 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- పూడిమడక రోడ్డు నుంచి వాడ్రాపల్లి, పాటిపల్లి, నాగవరం, తోటాడ తదితర గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించేందుకు రూ.48 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం.
- రూ.25 లక్షల వ్యయంతో సుందరంగా సంపద తయారీ కేంద్రం
- శ్మశానవాటిక అభివృద్ధికి రూ.20 లక్షల మేర ఖర్చు చేశారు.
- పలు చోట్ల కల్వర్టులు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు వంటి పనులు చేపట్టి ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలిచింది మునగపాక పంచాయతీ.

పాలకవర్గం సేవలు భేష్

మునగపాక పంచాయతీ సర్పంచ్ దిమ్మల అప్పారావు దళితుడైనా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి పారిశుధ్య కార్మికులతో గ్రామం అంతా పారిశుధ్యం మెరుగు పనులను స్వయంగా పరిశీలిస్తూ ఆయన దినచర్య ప్రారంభమవుతుంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యుల సహకారంతో పెద్దపీట వేస్తున్నారు.

అభివృద్ధికి పెద్దపీట



ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నా. గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యుల సహకారంతో మునగపాక పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నా. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ మరింత సహకరించాలి.

– దిమ్మల అప్పారావు, సర్పంచ్, మునగపాక

వైఎస్ జగన్ పాలన సువర్ణయుగం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణయుగం. ఆయన హయాంలో గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం లభించింది. సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా పలు సేవలు ప్రవేశపెట్టారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, రహదారులు, కాలువలు వంటి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చాం. ప్రజలకు సకాలంలో సేవలందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలన సాగింది.

– యూవీ రమణమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్యే



రూ.38 లక్షలతో నిర్మించిన దళితవాడకు వెళ్లే రోడ్డు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



మద్యం సీసాలతో పట్టుబడిన నిందితునితో ఎక్సైజ్ అధికారులు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఒంపోలు గ్రామానికి చెందిన మంత్రి గణేష్ ఈశ్వర సంతోష్ అప్పారావు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.నారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో సంతోష్ అప్పారావు నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది శ్రీను, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ఎంజేపురం ఫీడర్ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. మల్లవరం జంక్షన్, నరేంద్రపురంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కె.వాతా, చినఉప్పలం, బంగారమ్మపాలెం గ్రామాల మీదుగా ఉన్న విద్యుత్ లైనులో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పనులు పునః ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు, సీఐటీయూ నాయకుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు ఒక వారం చేపట్టి నిలిపివేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం లబ్ధిదారులతో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జనవరి నుంచి చేపట్టాల్సి ఉండగా.. ఏప్రిల్ నెలలో ఒక వారం రోజులు మాత్రమే చేపట్టారన్నారు. ఇలా పేదల పొట్ట కొట్టడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ చట్ట ప్రకారం పనులు కల్పించకపోతే భృతి ఇవ్వాలన్నారు. వెంటనే నిలిపివేసిన పనులను పునః ప్రారంభించి, పేదలకు ఉపాధి కల్పించాలన్నారు. లేదంటే ఉపాధి హామీ కూలీలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు లావేటి పార్వతి, అచ్చిబాబు, లక్ష్మి, వెలగా మహాలక్ష్మి, వేగి వెంకనాయుడు, పి.అప్పలనర్స, డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి



గుడివాడలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు



రేగుపాలెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు 10 వారాలుగా చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం యలమంచిలి మండలం రేగుపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లిన సిటు నాయకులు కూలీలతో మాట్లాడారు. 10 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కూలీలు వారికి చెప్పుకున్నారు. కూలీలకు బకాయి పడిన వేతనాలను చెల్లించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సిటు నాయకులు స్పష్టం చేశారు. మండే ఎండలో పనులు చేస్తున్న కూలీలకు తాగునీరు, మజ్జిగ ఇవ్వడం లేదని, ప్రాణాలకు తెగించి పొట్టకూటి కోసం కూలీలు పనులు చేస్తున్నారన్నారు. బకాయి పడిన వేతనాలను చెల్లించకపోతే కూలీలకు మద్దతుగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, ఆర్.రాంబాబు, పవన్, పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: గ్రామాల్లో 14 వారాలుగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ తెలిపారు. గుడివాడ గ్రామంలో సోమవారం ఉపాధి కూలీలు కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎండను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తున్న కూలీలకు నగదు చెల్లించకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించరాఉ. ప్రభుత్వ పథకాలను ఎలాగు ఎగ్గొటారు.. కనీసం కష్టపడి పని చేసిన నగదు అయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో ఖాళీగా ఉన్న మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ తెలపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం ఉద్యావన సహాయకులు, వ్యవసాయ సహాయకులతో సోమవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 185 హెక్టార్ల భూమి ఖాళీగా ఉన్నట్టు గుర్తించామన్నారు. సుమారు 20 రకాల పండ్ల మొక్కల పెంపకం చేపట్టేందుకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సౌజన్య, ఏపీవో యరకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామరక్ష రథయాత్ర



రథయాత్ర ముందు కోలాటం ఆడుతున్న చిన్నారులు

అచ్యుతాపురం: శ్రీరామరక్ష రథయాత్ర సోమవారం అచ్యుతాపురం మండలంలో కొనసాగింది. వెదురువాడ, గొర్లె ధర్మవరం, వెంకటాపురం, లంక ధర్మవరం, ఎస్ఈజెడ్ కాలనీ, దిబ్బపాలెం మీదుగా ఈ రథయాత్ర సాగింది. మంగళ హారతులు, కోలాట ప్రదర్శనలు, భజనలతో భక్తులు స్వాగతం పలికారు. ఈ రథయాత్రలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, రాజాన సన్యాసినాయుడు, బైలపూడి రామదాసు, చేకూరి శ్రీనివాసరాజు, కొల్లి అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే విలువలతో కూడిన విద్య

గ్రామాల్లో ఉపాధ్యాయుల విస్తృత ప్రచారం



పెట్టుగోళ్లపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



కె.వెంకటాపురంలో విద్యార్థులను చేర్చాలని కోరుతున్న హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు



రాచపల్లిలో విద్యార్థులకు కరపత్రాలు పంచి బడిలో చేరాలని కోరుతున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: సర్కారు బడిలో చేర్పిస్తే చదువుతో పాటు విలువలతో కూడిన విద్యను అందిస్తామని మండలంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఇళ్ల బాట పట్టారు. గ్రామాల్లో పర్యటిస్తూ తల్లిదండ్రులను, విద్యార్థులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే చర్యల్లో భాగంగా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం చేపట్టారు. సోమవారం పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ ఫాతిమా మున్సీసాలు పెట్టుగోళ్లపల్లిలో ప్రచారం చేశారు. గత రెండేళ్లగా పాఠశాలలో సాధించిన ప్రగతిని తల్లిదండ్రులు, విద్యార్థులకు తెలియజేశారు. సర్కారు బడుల్లో చదుకొనడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా బ్యాగు లు, పుస్తకాలు, పాఠ్య, నోట్ పుస్తకాలు అందిస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్న ట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, ఏవీఎస్ కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన అందిస్తున్నామని, మీ పిల్లలను చేర్పాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్, కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న ఉచిత విద్య, సదుపాయాలను వివరించారు. కె.వెంకటాపురంలో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యార్థుల ఇళ్లను సందర్శించి పాఠశాలలో చేర్చాలని కోరారు. కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు రాచపల్లిలో పర్యటించి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

అమ్మఒడి నగదు ఎప్పుడు జమ చేస్తారు?

ఉపాధ్యాయులను ప్రశ్నించిన ఉపాధి కూలీలు



ఎస్.రాయవరంలో ఉపాధి పనుల వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



గుడివాడలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న పిల్లలకు అమ్మఒడి ఎప్పుడు వేస్తారని పలువురు విద్యార్థుల తల్లులు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ఎస్.రాయవరం, గుడివాడ గ్రామాల్లో ఆయా ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎస్.రాయవరంలో ఉపాధ్యాయులు నేరుగా ఎన్ఆర్ఈజీఎస్ పనుల వద్దకు వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సమయంలో పలువురు మహిళలు అమ్మఒడి డబ్బులు ఎప్పుడు వేస్తారని, అసలు వేస్తారా? వేయరా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారింది కదమ్మా.. త్వరలో వస్తాయని చెప్పి అక్కడి నుంచి ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. గుడివాడలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు వీసం ప్రసాద్, బి.రామారావు, కుందూరు రాజు, భవాని పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్ కళాశాల కేంద్రంగా ఏయూ సెమిస్టర్ పరీక్షలు

ఎస్.రాయవరం: ఏయూ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు అడ్డురోడ్డు ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాల ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ ప్రకాష్ సోమవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి జరిగే ఈ పరీక్షలకు తుని శ్రీప్రకాష్, పరిసర ప్రాంతాల విద్యార్థులు హాజరవుతారన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం 2వ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం 4వ సెమిస్టర్ పరీక్షలకు 660 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష



ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశ కోసం సోమవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 249 మంది విద్యార్థులకు 216 మంది పరీక్షకు హాజరయ్యారు. 33 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రవేశ పరీక్ష నిర్వహించిన తీరును ఎంఈవో–2 బుద్ధ శివనాయుడు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

డ్రోన్‌తో పటిష్ట నిఘా



వమ్మవరం గ్రామం శివారులో డ్రోన్ కెమెరా తీసిన ఫొటో

ఎస్.రాయవరం: మండలంలో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా పెట్టామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మండలంలో సోమవారం వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో డ్రోన్‌తో పర్యవేక్షించామన్నారు. గ్రామాల్లో రహస్య ప్రదేశాల్లో చట్ట విరుద్ధ కార్యక్రమాలు చేపడితే ఇకపై డ్రోన్ నిఘా ద్వారా తెలుసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు.